ప్రజాశక్తి

సోమవారం 23, జనవరి 2023 | 5 | అనంతపురం

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

అక్కడ అలా..ఇక్కడ ఇలా..!

పేదల సొంతింటి కల కలగానే మిగులుతోంది. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన టిడ్కో ఇళ్లు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇదే సమయంలో..ఇదే పథకంతో కర్నాటక రాష్ట్రంలో ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయి లబ్ధిదారులు గృహ ప్రవేశం కూడా చేసి జీవనం సాగిస్తున్నారు. అయితే ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఐదేళ్లు గడుస్తున్నా టిడ్కో ఇళ్లకు మోక్షం కలగడం లేదు. డబ్బు చెల్లించినా సొంతింటికి నోచుకోలేకపోతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఐదేళ్లయినా లబ్ధిదారులకు అప్పగించని టిడ్కో ఇళ్లు

మాటలతో దాటేస్తున్న అధికారులు అయోమయంలో లబ్ధిదారులు

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అనంతపురం కార్పొరేషన్‌తో పాటు హిందూపురం, ధర్మవరం, కదిరి, తాడిపత్రి తదితర పురపాలక సంఘాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద లబ్ధిదారులకు జీ ప్లస్ త్రీ తరహాలో ఏపీ టిడ్కో ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. గత ప్రభుత్వం 50 వేలకుపైగా ఇళ్లు మంజూరు చేస్తే.. వైసిపి ప్రభుత్వం వివిధ కారణాల నేపథ్యంలో 16,272 మంది లబ్ధిదారులకు మాత్రమే టిడ్కో ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించింది. మిగిలిన 34,628 మంది చెల్లించిన డిపాజిట్ నగదు రూ.33 కోట్లు వెనక్కి ఇస్తామని ప్రకటించి మమ అనిపించింది. ప్రభుత్వం ఈ ప్రకటన చేసి కూడా మూడేళ్లైంది. ఇప్పటికీ ప్రకటించిన వారికి టిడ్కో ఇళ్లు కట్టించి ఇవ్వలేదు. చెల్లించిన డిపాజిట్ డబ్బులూ ఇవ్వలేదు.

హిందూపురంలో.....

టిడిపి హయాంలో 2018 జనవరి 10న హిందూపురం పట్టణం కొడిపి సమీపంలో ఇళ్లు లేని వారికి ఆర్భాటంగా టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ భూమిపూజ చేశారు. సంబంధిత నిర్మాణ పనులను ప్రముఖ కార్పొరేట్ సంస్థ షాపూర్ జి పల్లోంజి దక్కించుకుంది. దాదాపు రూ.160 కోట్లతో 2,750 ఇళ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టారు. గతంలో ఇదే స్థలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. నల్లరేగడి నేల కావడంతో ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేమని లబ్ధిదారులు ముందుకు రాలేదు. అపార్ట్‌మెంట్స్ నాణ్యతగా కట్టడం చూసిన లబ్ధిదారులు ఇళ్లను తీసుకోవడానికి ముందుకొచ్చారు. క్యాటగిరి 1 కింద 1104 మంది లబ్ధిదారులు, క్యాటగిరి 2 కింద 478 మంది, క్యాటగిరి 3 కింద 288 మంది లబ్ధిదారులు మున్సిపల్ అధికారులకు డిడిలు చెల్లించారు. దాదాపు 1700 గృహాలు పూర్తి అయ్యాయి.

హిందూపురం కొడిపి సమీపంలో దిష్టి బొమ్మల్లా దర్శనం ఇస్తున్న టిడ్కో గృహాలు

కర్నాటక రాష్ట్రం టుంకూరులో టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారులు

వీరందరికి నాడు టిడిపి, నేడు వైసిపి ప్రభుత్వాలు రెండూ సార్లు గృహ మంజూరు పత్రాలను అందజేశారు. పక్కాగృహాలు పూర్తవడంతో టిడిపి హయాంలోనే ఆర్భాటంగా అధికారులు లాంఛన ప్రాయంగా గృహప్రవేశాలు కూడా చేయించారు. ఇంకా కొన్ని మౌలిక వసతులు కల్పించాల్సి ఉండడంతో లబ్ధిదారులు ఇళ్లల్లో చేరలేదు. విద్యుత్, రహదారుల పనులు కొంతమేర పూర్తయినా తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించడానికి నిధులు మంజూరయ్యే సమయంలో 2019 శాసన సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా మౌలిక సదుపాయాల కల్పనకు చొరవ చూపలేదు. లబ్ధిదారులకు డిసెంబర్‌లో ఇళ్లు మంజూరు చేస్తామని జియో ట్యాగింగ్ సైతం పూర్తి చేశారు. సొంతిల్లు వస్తుందని లబ్ధిదారులు రూ.వందలు ఖర్చు చేసి జియో ట్యాగింగ్ చేయించారు. జిల్లా వ్యాప్తంగా టిడ్కో గృహ నిర్మాణ పనులు నిలబడి మూడేళ్లు అవుతోంది. దశబ్ద కాలంగా పుర ప్రజల సొంతింటి కల కలగానే మిగులుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం టిడ్కో గృహ సముదాయం వద్ద ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించి, మిగిలిన గృహాల పనులను త్వరతగితిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

వేగవంతం చేస్తున్నాం..

శ్యాంసుందర్, టిడ్కో ఈఈ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసే దిశగా చర్యలు తీసుకున్నాం. అక్కడక్కడా సమస్యలు ఉన్నాయి. వాటిని త్వరలోనే పూర్తి చేసి ప్రభుత్వ అదేశాల మేరకు లబ్ధిదారులకు అప్పగిస్తాం. డిపాజిట్ల నగదు విషయం ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే పడతాయని తెలిసింది. పూర్తయిన ఇళ్లను త్వరలోనే అందించే అవకాశం ఉంది. లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

త్వరగా ఇళ్లు కేటాయించాలి

గృహ లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లను పూర్తిచేసి త్వరతగితిన లబ్ధిదారులకు స్వాదీనం చేయాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులకు ఉచితంగా ఇళ్లు కేటాయించాలి. సొంత ఇంటి కోసం ఎందరో ఆశగా ఎదురు చూస్తున్నారు. వెంటనే ప్రభుత్వం ఆగిన నిర్మాణ పనులను ప్రారంభించాలి. దీంతో పాటు జగనన్న కాలనీల్లో మౌళిక సదుపాయాలు కల్పించి, ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి. సచివాలయాల పరిధిలో మరోసారి పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి, ఇల్లులేని వారందరికీ స్థలంతో పాటు ఇల్లు నిరించి ఇవ్వాలి. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతాం – **ఇంతియాజ్, సిపిఎం సత్యసాయి జిల్లా కార్యదర్శి**

వేమన ఒరవడికి కొరవడి లేకుండా కొనసాగింపే..అమర్ రచనలు..

ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వేమన ఒరవడికి కొరవడి లేకుండా కొనసాగింపే.. తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి రచనలు అని ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో మానవత కన్వీనర్ తరిమెల అమరనాథ్‌రెడ్డి రచించిన 12వ పుస్తకం 'మేరా భారత్ మహాన్' ఆవిష్కరణ సభ ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరిమెల అమరనాథ్‌రెడ్డి సమకాలీన మానసిక భావజాలాలను సమాజంలో పెరుగుతున్న అంధ, మూఢ, మతమౌఢ్యాలను తన పదునైన అక్షరాలతో సూక్ష్మంగా చదువు రాని పేదలకు సైతం సులువుగా అర్థమయ్యే విధంగా ఉండడం ప్రజాకవి వేమన వరవడిని కొరవడి లేకుండా కొనసాగింపు అనిపిస్తుందన్నారు. 400 సంవత్సరాల క్రితం వేమన తన పద్యాలతో సమాజంలో ఉండే మూఢనమ్మకాలను ఏ విధంగా ప్రశ్నించినాడో ఆధునిక కాలంలో మనిషి అంతరిక్షం దాటి ఆకాశం అంచులను సరిహద్దులుగా పెట్టుకునే తరుణంలో కూడా అంతే అంధ విశ్వాసాలతో ఉన్నారని.. పేదవాడికి పనిముట్టుగానే చూస్తున్నారే తప్ప మనిషిగా చూడడం లేదన్నారు. డబ్బును గౌరవించే సంస్కారం నుండి మనిషిని మనిషిగా గౌరవించే సంస్కారమైన సమాజం కావాలని కోరుకుంటాడన్నారు. అనునిత్యం శ్రమజీవుల మధ్య వారి కోసం పాటుపడుతూ, వారి సాధకబాధకాలను తనుకు ఎదురైన పరిస్థితులు, సంఘటనలకు అక్షర రూపం ఇచ్చి 12 పుస్తకాలను అమర్‌నాథ్ సమాజానికి అందించారన్నారు. తాను నమ్మే సిద్ధాంతాలను ఆచరణ రూపంలో పెట్టడమే నేటి 'మేరా భారత్ మహాన్' అని కొనియాడారు. జన్నే గణేష్ చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించడం.. సాధారణ రక్తదాత, అతి సామాన్య శ్రమజీవి జన్నే గణేష్.. ఈ ఉదాహరణ చాలు అమరనాథ్ రెడ్డి ఆలోచనలకు అద్దం పట్టడానికి అని తెలిపారు. విరసం రచయిత్రి ఆర్ శశికళ ప్రసంగిస్తూ సామాన్యుల గొంతుకగా తరమెల అమరనాథ్ రెడ్డి సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించే నైజం ఆయన రచనలలో కనబడుతుంది అనడానికి ఉదాహరణ.. 'మతం రాజకీయాల అక్రమ దాంపత్యాన్ని విడాకులు ఇప్పియ్యాల అంటాడు.. శ్రమజీవుల స్వేదమే సమాజ పురోగతికి పెట్టుబడి అయినా వారికి ఆ పూట కూలి మాత్రమే దక్కుతుంది అని ఆవేదన చెందుతాడు.. మెడ కోసినా మడి కోసినా.. నాటు వేసినా.. ఓటు వేసినా.. నాకు దక్కేది ఆ పూట కూలి మాత్రమే అని పేదల తరపున ప్రశ్నిస్తాడు అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్ వేలూరి జయచంద్ర ప్రసంగిస్తూ 'మూఢవిశ్వాసాల జాడ్యం నిండకపోయినా ఈ సమాజంలో భవిష్యత్ తరానికి జాడ్యం తాకకుండా ప్రభుత్వాలు శాస్త్రీయ దృక్పథంతో కూడిన పాఠ్యాంశాలని అందించాలని.. అప్పుడే భవిష్యత్తులో సామాజిక స్పృహతో కూడిన సమాజం ఎదుగుతుందని, తక్షణ కర్తవ్యంగా ఎవరికి వారు ముఖ్యంగా ఉపాధ్యాయులు ఈ బాధ్యతను తీసుకోవాలని.. ఆయన ఆవేదన వ్యక్తం చేసిన తన మాటలు, రాతలలో ఆక్రందన తనకు కనపడుతుందన్నారు. తరిమెల అమరనాథ్ రెడ్డి రచనల సమీక్షకులుగా డాక్టర్ బావకాటి రాఘవేంద్ర సుదీర్ఘమైన, సుస్పష్టమైన విశ్లేషణ సభలో ఆశీనులైన వారిని మంత్రముగ్ధుల్ని చేసింది. నగర ప్రముఖులు, కవులు, రచయితలు, మేధావులు, కళాకారులు, మానవతా రక్తదాత సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సోలార్ భూముల ఆరోపణలపై విచారణ చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సోలార్ భూముల అక్రమ కొనుగోలుపై జిల్లా మంత్రి ఉష శ్రీచరణ్ పాత్రపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొద్ది నెలలుగా ఈ భూముల గురించి పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నా జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. విమర్శలకు ప్రతి విమర్శలు చేయడం, పోలీసుల ద్వారా నిర్బంధాన్ని ప్రయోగించి గొంతునొక్కడం ద్వారా ఆరోపణలు ఆగిపోవన్నారు. ఒకవైపు పేదలు ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం ఆందోళనలు చేస్తుంటే మరోవైపు ప్రభుత్వ పెద్దలు గద్దల్లా భూములు ఆక్రమించుకుంటున్న ఆరోపణలు రావడం ప్రభుత్వ స్వభావాన్ని స్పష్టం చేస్తుందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.కోట్లు విలువజేసే ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడం పాలక పార్టీలకు ఒక విధానంగా మారిందన్నారు. జిల్లాలో అత్యధిక నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు లేదా వారి కుటుంబసభ్యులపై భూముల ఆక్రమణలు, రియలెస్టేట్ వ్యాపారులతో కమీషన్ల కోసం బెదిరింపుల లాంటి ఆరోపణలు నిత్యం వస్తున్నాయన్నారు. వీటన్నింటిపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని రాంభూపాల్ డిమాండ్ చేశారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో బుక్కరాయసముద్రం మండలం రోటపురం నుంచి తాడిపత్రి మండలం భోగసముద్రం వరకు జరుగుతున్న జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు , భూములు కోల్పోతున్న బాధితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని రోడ్డు నిర్వాసితులు, ఎపి రైతుసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 2023 ధరల ప్రకారమే బాధితులకు పరిహారం ఇవ్వాలన్నారు. శివపురం, బండమీదపల్లి, చక్రాయపేట, పోతురాజు కాలవ, పెరవలి, నాయనపల్లి క్రాసింగ్‌లో వ్యవసాయ భూములు కోల్పోతున్న రైతులకు కనీసం సెంటు రూ.50వేలతో పరిహారం ఇవ్వాలన్నారు. పూర్తిగా భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారంతో పాటు ప్రభుత్వ భూమిని కేటాయించాలన్నారు. ఇళ్లకు సంబంధించి 2023 భూముల రేటు ప్రకారం నష్ట పరిహారం చెల్లించడంతో పాటు, 5 సెంట్ల స్థలం ఇచ్చి అందులో ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. గ్రామ కంఠంలో ఉన్న ఇళ్లకు ప్రయివేటు భూములతో సమానంగా ధరను నిర్ణయించి పరిహారం ఇవ్వాలని నిర్వాసితుల పక్షాన చేపట్టిన ధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత : విప్ కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందనివిప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని భంభం స్వామి లేఅవుట్‌లో ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో గతంలో ఉన్న 30 పడకల ఆసుపత్రి స్థానంలో వంద పడకలకు పెంచినట్లు తెలిపారు. ఆసుపత్రి నిర్మాణ దశలో ఉందని, మరో ఆరు నెలల్లో పూర్తవుతుందన్నారు. వీటితోపాటు పట్టణంలోని మరో రెండు ప్రాంతాల్లో పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చేస్తున్నట్లు తెలిపారు. గత టిడిపి ప్రభుత్వం కేవలం మాటలు, కాగితాలకే పరిమితమైందని విమర్శించారు. ఇప్పుడు తాము మంచి చేస్తుంటే ఓర్చుకోలేకపోతున్నారన్నారు. కావున అభివృద్ధి చేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని తిరిగి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాలు శిల్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి వీరబ్బాయి, పిఒ సుజాత, స్థానిక వైద్యులు సందీప్, రమేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు భోజరాజు నాయక్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, మున్సిపల్ వార్డు సభ్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

సత్యసాయి జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని మత్స్యశాఖ జిల్లా అధికారి ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. చెరువులలో, రిజర్వాయర్లలో చేపలు పట్టే శ్రామికులను మనం చూస్తూనే ఉంటాం. చెరువుల్లో, డ్యాములలో చేపలు పట్టేవారు అక్కడే రాత్రి పగలు మఖాంవేసి ఉంటారు. చాలామంది అదే వృత్తిగా జీవనం సాగిస్తుంటారు. వర్షాలు బాగా కురిసి డ్యాములలో, చెరువులలో సమృద్ధిగా నీరు చేరితేనే వారి వృత్తి కొనసాగుతుంది. లేకపోతే వారి కష్టాలు చెప్పడానికి వీలుండదు. గతంలో బెస్త కులస్తులు మాత్రమే చేపలు పట్టి వ్యాపారం చేసుకునేవారు. అయితే ఆ రోజులు పోయాయి. నేడు ఎస్సీ, ఎస్టీ, బీసీలలో చాలామంది చేపలు పట్టి జీవిస్తున్నారు. ఇప్పటికీ సరైన మార్కెటింగ్ లేక ఇబ్బందులు పడుతున్న సంఘటనలు ఉన్నాయి. చేపలు పట్టిన రోజే విక్రయించుకోవాలి. వాటిని నిలువ చేసుకునే వీలులేదు. ఆరోజు అమ్ముడు పోకపోతే వాటిని ఎండకు ఎండించి పచ్చి చేపలు కాస్తా ఎండు చేపలుగా వ్యాపారం చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వంలో అన్ని శాఖలు ఉన్నట్లే చేపల పరిశ్రమకు మత్స్యశాఖ ఉంది. సత్యసాయి జిల్లాలో చెరువులు డ్యాములు గురించి, చేపలు పట్టే శ్రామికుల గురించి ఆ శాఖ జిల్లా అధికారి ఎన్. చంద్రశేఖర్ రెడ్డి ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన చెప్పిన విశేషాలు ఇలా ఉన్నాయి.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని సహకార సంఘాలు ఉన్నాయి?

జవాబు : జిల్లాలో 47 సహకార సంఘాలు ఉన్నాయి. సంఘాలు లేని చోట ఆయా గ్రామ పంచాయతీల ద్వారా వేలం వేయించడం జరుగుతుంది. అనంతపురం జిల్లాలో చేపల ఫారాలు మూడు ఉన్నాయి. నూతన జిల్లా అయిన శ్రీ సత్యసాయి జిల్లాలో ఇలాంటి ఫారాలు ఇంకా నెలకొల్పలేదు. చేపల ఫారాలు ఉంటే చేపల మార్కెటింగ్, చేపల నిలువ తదితర సౌకర్యాలు ఉంటాయి. నూతన జిల్లాలో వాటిని నెలకొల్పడానికి కొంత సమయం పట్టవచ్చు.

ప్రశ్న : చేపలు పట్టేవారికి ప్రభుత్వపరంగా ఎలాంటి సహకారం అందిస్తున్నారు?

జవాబు : కార్మికులు చేపలు అమ్ముకోవడానికి సైకిళ్లు, ఇతర వాహనాల సౌకర్యం కోసం, సహకార సంఘాల కోసం రుణాలు ఇస్తాం. మినీ ఫిష్ రన్నింగ్ స్కీం కింద రూ.లక్ష వరకు రుణం అందిస్తాం. ఎస్సీలకు అయితే 60 శాతం సబ్సిడీ అందిస్తాం. ఇప్పటివరకు 40 మంది లబ్ధి పొందారు.

ప్రశ్న : సిబ్బంది కొరత ఉందా..మత్స్యకారులకు మీరిచ్చే సలహా ఏమిటి?

జవాబు : నూతన జిల్లా కనుక సిబ్బంది కొరత ఉంది. ప్రభుత్వానికి నివేదించాం. మత్స్యకారులు సహకార సంఘాలలో చేరి అభివృద్ధి చెందాలని ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకోవాలని కోరుతున్నాం.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య

ప్రజాశక్తి-గుత్తి

గోడపత్రికలు విడుదల చేస్తున్న కౌలు రైతుసంఘం నాయకులు

రాష్ట్రంలోని కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరంగయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో ఈనెల 26న అనంతపురంలో నిర్వహించనున్న ట్రాక్టర్ ర్యాలీకి సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై గతంలో ఢిల్లీ చుట్టూ ఐదు ప్రాంతాల్లో 500 రైతు సంఘాల కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 13 నెలలకుపైగా రోడ్డుపై రైతులు ఆందోళన చేపట్టారన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు, విద్యుత్తు సంస్థను ప్రయివేటు చేసే నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించకుండా కౌలు రైతులకు కేంద్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో చేపట్టిన ఆందోళనలో ప్రధాని మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ట్రాక్టర్ ర్యాలీలు, స్కూటర్ ర్యాలీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఆందోళనల్లో మండలంలోని రైతులు, కౌలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి.నిర్మల, గురు, నాగరాజు, నారాయణ, నారాయణస్వామి, చిన్న, సంజీవులు పాల్గొన్నారు.

ముగిసిన కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక పరీక్ష

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం సిటీ : అనంతపురం, గుత్తి రీజినల్ పరిధిల్లో ఆదివారం నిర్వహించిన కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. అనంతపురంలో 34 పరీక్షా కేంద్రాలు, గుత్తిలో 13 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 22,808 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. ఈపరీక్షకు 24055 మంది దరఖాస్తు చేసుకోగా 22,808 మంది హాజరయ్యారు. 1247 మంది గైర్హాజరయ్యారు.

జీవో 1 అధికార పార్టీ నాయకులకు వర్తించదా..

వైసిపి నాయకుల బైక్ ర్యాలీపై విమర్శలు

ప్రజాశక్తి-గుత్తి

భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 1 అధికార పార్టీ నాయకులకు వర్తించదా.. అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎందుకంటే వైసిపి నాయకులు ఆదివారం పట్టణంలో నిర్వహించిన బైక్ ర్యాలీ, మార్కెట్ యార్డులో బహిరంగ సభ ఈ విమర్శలకు తావిస్తోంది. మండలంలోని కొజ్జేపల్లి గ్రామానికి చెందిన చెవుల సునీల్‌యాదవ్ మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్‌గా నియమించడంతో ఆదివారం స్థానిక పట్టణంలోని మార్కెట్ యార్డులో ప్రమాణ స్వీకారోత్సవం ఏర్పాటు చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ చెవుల మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహం నుంచి వైసిపి నాయకులు గాంధీ చౌక్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్, మార్కెట్ యార్డ్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ముగిసేంత వరకు పోలీసులే బందోబస్తు ఏర్పాటు చేయడం విమర్శలకు మరింత బలం చేకూరుతోంది. ఎందుకంటే గత నెలలో టిడిపి అధినేత చంద్రబాబు ఏర్పాటు చేసిన సభల్లో తొక్కిసలాటలు చోటు చేసుకుని పలువురు మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో ఆయా మరణాలను సాకుగా చూపుతూ ప్రభుత్వం సభలు, ర్యాలీలు నిర్వహించకూడదని జీవో 1 తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ జీవో తీసుకురావడాన్ని ప్రతిపక్ష పార్టీలతోపాటు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పూర్తిగా వ్యతిరేకించారు. అందోళనలు కూడా చేశారు. అయినా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. అయితే ఈ జీవో కేవలం ప్రతిపక్షాలకు మాత్రమేనా.. అధికార పక్షానికి చెల్లదా.. అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎందుకంటే ఆదివారంకానిస్టేబుల్ ఉద్యోగాల కోసం రాత పరీక్ష నిర్వహించేందుకు పట్టణంలో ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గుత్తిలో 144 సెక్షన్ విధించారు. అంతేగాకుండా సభకు కూతవేటు దూరంలో ఉన్న శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం రాత పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భారీ శబ్దాలు, జగనన్న పాటలతో సభా ప్రాంగణం దద్దరిలేలా ఎంపి, ఎమ్మెల్యే, వైసిపి నాయకులు గంటల పాటు ప్రసంగించారు. ఆ శబ్దాలకు పరీక్ష కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఈనేపథ్యంలో పట్టణంలో 144 సెక్షన్ ఉండగా బైక్ ర్యాలీ చేపట్టి, బహిరంగ సభ నిర్వహించడం పట్ల బహిరంగగానే పలువురు పెదవి విరుస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే వామపక్షాలు, ప్రతిపక్షాలకు ఒక న్యాయం, అధికార పార్టీ నాయకులకు ఒక న్యాయమా.. అని పలువురు అంటున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

టౌన్ బ్యాంక్ ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తి

ఒక నామినేషన్ తిరస్కరణ

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ కో అపరేటివ్ టౌన్ బ్యాంక్ పాలక మండలి ఎన్నికల నామినేషన్ల పరిశీలన ఆదివారం పూర్తయినట్లు ఎన్నికల అధికారి బాలగంగాధర్ తెలిపారు. మొత్తం 21 నామినేషన్లు దాఖలు కాగా ఒక్క నామినేషన్ తిరస్కరణకు గురైనట్లు తెలిపారు. ముగ్గురు పిల్లలు కలిగి ఉన్నాడనే కారణంతో ఫిర్యాదుదారులు సమర్పించిన ఆధారాలకు అనుగుణంగా విశ్వనాత్ అనే వ్యక్తి నామినేషన్ తిరస్కరించినట్లు తెలిపారు. ప్రస్తుతానికి 20 మంది నామినేషన్లు ఎన్నికల నిబంధనల ప్రకారం ఉన్నాయన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంటుందన్నారు. నామినేషన్ల ఉపసంహరణ తరువాత ఎన్నికలు జరిగే అవకాశం ఉంటే అప్పుడు బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఐసీ రవి, బ్యాంకు సీఈఓ వేదమూర్తి, డీఎల్‌సిఓ సతీష్, అనంతపురం ఎస్‌డిఎల్‌ఓ, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లను పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల రద్దు దుర్మార్గం

ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలి, ముష్కిన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను రద్దు చేయడం దుర్మార్గమని ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలి, ముష్కిన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ముస్లిం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చేవారన్నారు. అయితే ఇప్పుడు కేవలం 9, 10వ తరగతి విద్యార్థులకు మాత్రమే ఇస్తాననడం సిగ్గుచేటన్నారు. అంతేగాకుండా కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక మైనార్టీలపై దాడులు అధికమయ్యాయన్నారు. మైనార్టీలను ఏం తినాలో.. ఏం తినకూడదో.. ఏం కట్టాలో.. ఏం కట్టకూడదో.. బిజెపి నిర్ణయాలు తీసుకోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి తన నిర్ణయాలను మార్చుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు మసూద్‌వలి, ఇర్ఫాన్, నిజాం, ఇస్మాయిల్, శర్మాస్, హుస్సేన్, లాయర్ అబ్దుల్, రసూల్, ఇన్నాబ్, జిల్లా కార్యదర్శి బాషా, ముస్లిం ఐక్యవేదిక నాయకులు జాకీర్, నిజాం బాషా, తాజ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, జిల్లా అధ్యక్షులు వెంకటేష్, నగర నాయకులు రాజా, రజక సంఘం నాయకులు నాగభూషణ, కార్మిక సంఘం నాయకులు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆవాజ్ నాయకులు

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని 6, 11వ ఎన్నికల వార్డుల్లో సిమెంటు రోడ్డు నిర్మాణాలకు విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. ఒక్కొక్కటి రూ.10 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాలు శిల్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, వలిబాషా, మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, మున్సిపల్ ఇంజినీర్లు రామమూర్తి, గోపీనాథ్, మున్సిపల్ వార్డు సభ్యులు మంజునాథ, లావణ్య, డిష్ గోవిందా, శ్రీలక్ష్మి, నాగవేణి, పద్మజ, శ్రీనివాసరెడ్డి, గోవిందరాజులు, ప్రతాప్, దేవరాజు, ఫక్రుద్దీన్, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, బ్యుల, నజీర్, గుమ్మగట్ట జడ్పిటిసి సభ్యులు మహేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు భోజరాజు నాయక్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, వైకాపా నాయకులు శివ, శ్రీరామ్ రెడ్డి, నిజాముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

'ఉపాధి'పై గ్రామసభ

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని బొందలవాడ గ్రామంలో ఆదివారం ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులపై అలం వెంకట నరసానాయుడు అధ్యక్షతన సోషల్ అడిట్ నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులు ఉపాధి హామీ పథకం కింద జరిగిన పని దినాలు, డ్రైలాండ్, హార్టికల్చర్, అవెన్యూ ప్లాంటేషన్ తదితరాల తీరును వివరించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కూలీలు, రైతులు కోరారు. అలాగే నాలుగేళ్లుగా డ్రైలాండ్, హార్టికల్చర్, పండ్ల తోటల రైతులకు సంబంధించిన బిల్లులను చెల్లించాలని అధికారు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి, శ్రీనివాసులు, ఎపిఒ ఓబన్న, వార్డు నెంబర్ చంద్రమౌళి, టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జున, పద్మావతి, ఎస్‌ఆర్‌పి విజయ్‌భాస్కర్, డీఆర్‌పి అనిల్, ఉపాధి కూలీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు సహాయ పడితే బహుమతులు

గుంతకల్లు ఎంవిఐ రాజాబాబు

ప్రజాశక్తి-గుంతకల్లు

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు సహాయపడి సకాలంలో ఆసుపత్రులకు చేర్పిస్తే ప్రభుత్వం ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తోందని ఎంవిఐ ఎన్‌వి.రాజాబాబు తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక (ఐఓసిఎల్) ఇండియన్ ఆయిల్ కంపెనీ లిమిటెడ్ డిపోలో ట్యాంకర్ల డ్రైవర్లకు రోడ్డు భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ సరఫరా చేసే ట్యాంకర్ల డ్రైవర్లు ఎక్కువ శాతం సుదూర ప్రాంతాలకు వెళ్తుంటారన్నారు. అలాంటి సమయంలో రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తే సురక్షితంగా తమగమ్యాలకు చేరుకుంటారన్నారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు ఘటనా స్థలంలోని క్షతగాత్రులను సకాలంలో వారిని ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తే అలాంటి వారికి ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతిగా రూ.5వేలు అందించడంతోపాటు గుడ్ సమారిటీన్ సర్టిఫికెట్ అందిస్తుంచనున్నట్లు తెలిపారు. అనంతరం గుడ్ సమార్టిన్ ప్రచార గోడపత్రికలను ఐఒసిఎల్, ప్రభుత్వ ఆసుపత్రి గోడలకు అతికించారు. ఈ సదస్సులో ఐఒసిఎల్ అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, డ్రైవర్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంవిఐ రాజాబాబు

రాయదుర్గంలో మాట్లాడుతున్న ఎంవిఐ శివరామ్‌ప్రసాద్

రాయదుర్గం : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రవాణా శాఖ ఉప కమిషనర్ శివరామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో విప్ కాపు రామచంద్రారెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో రవాణా శాఖ ఉప కమిషనర్ మాట్లాడుతూ రహదారులపై వాహనాల్లో ప్రయాణించినప్పుడు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారి విశ్వనాథరెడ్డి, స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ సురేష్‌కుమార్, రవాణా శాఖ అధికారులు, డ్రైవర్లు, వాహన యజమానులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విద్యార్థులతో ఇంటాక్ సభ్యులు

అనంతపురం : నగరంలోని రోటరీ పాఠశాలలో 'ఖానా ఖజానా' అనే అంశంపై ఇంటాక్ అనంతపురం ఆధ్వర్యంలో 7, 8, 9వ తరగతి చదివే విద్యార్థులకు ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటాక్ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకే ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ కన్వీనర్ ఆర్.రామ్‌కుమార్, ఇంటాక్ సభ్యులు, పూర్వపు కన్వీనర్ ఏజి.వేణుగోపాల్, ఇంటాక్ సభ్యులు పతికి రమేష్‌నారాయణ, బిజె గుప్తా, కెవి రమణ, కంబదూర్ నబిరసూల్, రవీంద్రారెడ్డి, కృష్ణమూర్తి, యాడికి సూర్యనారాయణరెడ్డి, గంగిరెడ్డి, అశ్వర్థరెడ్డి, ఆర్.గురుజీ, జూటురి షరీఫ్‌బాషా, గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవా సంస్థకు బెస్ట్ సర్వీస్ అవార్డు

ఉరవకొండ : నిస్వార్థ సేవా సంస్థకు బెస్ట్ సర్వీస్ అవార్డు వచ్చినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వెంకట్ తెలిపారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో అభయ ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థ సేవా సంస్థ విద్యతో పాటు వాతావరణ కాలుష్యం నివారించే దిశగా చెట్లు పెంచడం, మూఢనమ్మకాలను నివారించేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి నిస్వార్థ సేవా సంస్థను ఎన్నిక చేసి ఆ సంస్థకు బెస్ట్ సర్వీస్ అవార్డు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు.

అవార్డు అందుకుంటున్న నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకట్

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

పుట్లూరు : పదో తరగతి విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని తహశీల్దార్ సుమతి, ఎంపిడిఒ యోగానందరెడ్డి సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో నిర్వహించిన 'అనంత సంకల్ప' కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించుకుని చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్, ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష

గుత్తి : కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన ప్రిలిమినరీ రాత పరీక్ష ఆదివారం గుత్తిలో ప్రశాంతంగా సాగింది. పట్టణ పరిధిలో ఏడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు సంబంధించి 2,260 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 115 మంది గైర్హాజరయ్యారు. 2115 మంది విద్యార్థులు మాత్రమే ఉద్యోగాల ఆశావాహులు పరీక్ష రాశారు. ఉదయం 8 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. కాగా ఎస్పీ ఫక్కీరప్ప గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ గజ్జల రఘునాథరెడ్డి సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నరసింగప్ప, చైతన్య, గంగయ్య, సీఐలు వెంకటరామిరెడ్డి, మహేశ్వరరెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వర్థ నారాయణస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల కేంద్రం సమీపంలో వెలసిన అశ్వర్థ నారాయణస్వామి, భవానీ భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం మొదటివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి వారమే భక్తులు ఉదయాన్నే బారులుదీరి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో హరినామస్మరణతో అశ్వర్థం మారుమోగింది. ముందుగా భక్తులు ఉత్తర, దక్షిణం ప్రవహించే పెన్నానదిలో స్థానమాచరించి పొంగుపాలు పెట్టి స్వామివారిని దర్శించుకున్నారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. కాగా ఆర్టీసీ అధికారులు అశ్వర్థానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఇఒ సుబ్రహ్మణ్యం, ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అలాగే ఎస్పీ ఫక్కీరప్ప ఆదేశాల మేరకు డీఎస్పీ చైతన్య ఆధ్వర్యంలో భద్రత ఏర్పాట్లు చేశారు.

అశ్వర్థ నారాయణస్వామి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చిన భక్తులు

చలివేంద్రం ఏర్పాటు

స్వామివారి భక్తుల సౌకర్యార్థం ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఎస్ఐ జి.ఖాజాహుస్సేన్ ప్రారంభించారు. అశ్వర్థ నారాయణస్వామి భక్తులు ఇబ్బందులు పడకుండా నీటి సౌకర్యం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, సంస్థ అధ్యక్షులు దొగురు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి నారాబోయిన శంకర్, కన్వీనర్ చెన్నకేశవులు, రంగయ్య, ఉపాధ్యక్షుడు రామంజినేయులు, సంయుక్త కార్యదర్శి గురప్ప, సభ్యులు నాగేశ్వరరావు, లాయర్ కుమార్‌స్వామి, మంజులవాణి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ ఖాజాహుస్సేన్

నాగబాబుతో కరచాలనం చేస్తున్న శింగనమల నియోజకవర్గ జనసేన నాయకులు కొండిశెట్టి ప్రవీణ్

నాగబాబును కలిసిన కొండిశెట్టి ప్రవీణ్

ప్రజాశక్తి-నార్పల

జిల్లా పర్యటనకు వచ్చిన జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు కొణిదెల నాగబాబును శింగనమల నియోజకవర్గ జనసేన నాయకులు కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్ ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులను వివరించినట్లు కొంటిశెట్టి తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో పార్టీ బలోపేతం కోసం కార్యాచరణ రూపొందించుకొని పని చేస్తున్నామని వివరిస్తున్నట్లు తెలిపారు. అలాగే వైసిపి అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక చర్యలపై చేస్తున్న పోరాటాలు చెప్పామన్నారు. ఇందుకు స్పందించిన నాగబాబు భవిష్యత్తు జనసేనపార్టీదేనని పార్టీ కోసం మరింత కష్టపడి పనిచేయాలని సూచించినట్లు తెలిపారు.

కంటి వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి దంపతులు

కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, బ్రాహ్మణి సోషల్ వెల్ఫేర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా ఆదివారం కంటి, గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నంద్యాలకు చెందిన శాంతిరాం కంటి ఆసుపత్రికి చెందిన వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 261 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 121 మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసినట్లు క్యాంపు ఇన్‌ఛార్జి సురేష్‌బాబు తెలిపారు. అదేవిధంగా గుండె పరీక్షలు 41 మందికి జరపగా అందులో 12 మందిని ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేసినట్టు తెలిపారు. వీరిని నంద్యాలలోని ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాలను విప్ కాపు రామచంద్రారెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి పర్యవేక్షించడంతోపాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

మార్చి 15న చలో ఢిల్లీ

ప్రజాశక్తి-నార్పల

వికలాంగుల పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ మార్చి 15న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వికలాంగుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వికలాంగుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు ప్రయివేట్ రంగాల్లో రిజర్వేషన్ సాధన కోసం దేశవ్యాప్తంగా పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వికలాంగులకు ఆహార భద్రత కల్పించాలని, పింఛన్ పెంచాలని డిమాండ్ చేశారు. 2011లో పెంచిన పింఛన్లను ఇప్పటి వరకు పెంచలేదన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల బ్యాక్‌లాక్ పోస్టులు భర్తీ చేయాలని, 2016 చట్టం ప్రకారం ఇంటి స్థలాలు, పట్టాలు ఇవ్వాలని, వికలాంగులకు పెండింగ్‌లో ఉన్న మ్యారేజ్ ఇన్సెంటివ్ ఇవ్వాలని, వికలాంగులకు కమ్యూనిటీ భవనాలు నిర్మించి ఇవ్వాలని, అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, వికలాంగ విద్యార్థుల మెస్‌ఛార్జీలు పెంచాలని, త్రీవీలర్ మోటార్ సైకిళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వికలాంగుల సంఘం అధ్యక్షులు అమీర్, కె.కుళ్లాయప్ప, గౌరీ, శారద, నాగలక్ష్మి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని సలకంచెరువు గ్రామానికి చెందిన ముత్యాల లీలావతి, పెద్ద కిష్టప్ప కుమార్తె అశ్విని వివాహానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆదివారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వివాహాలకు ఆర్థికసాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ కోశాధికారి శ్రీనివాసులుగౌడ్, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, దైవయత్నం, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థికసాయం అందజేస్తున్న దండు శ్రీనివాసులు

సుబ్రమణ్యేశ్వర స్వామికి మాఘమాస పూజ ప్రారంభం

హోమం చేస్తున్న అర్చకులు

ఆత్మకూరు : మండల పరిధిలోని పంపనూరు గ్రామంలో వెలసిన సుబ్రమణ్యేశ్వరస్వామి మాఘ మాసం మొదటి ఆదివారం పూజలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సహస్ర మోదుక మహాగణపతి హోమం, సుబ్రమణ్యేశ్వర స్వామికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అర్చన, మహానైవేద్యం, పల్లకీసేవ, మహామంగళహారతి, కుజదోష, కాలసర్పదోష, సర్పదోష నివారణ కోసం సుబ్రమణ్యేశ్వరస్వామి మూలమంత్ర బీజాక్షర హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ దిబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి, పంపనూరు సర్పంచి ఎర్రిస్వామి, గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

27 నుంచి 'పిల్లల పండుగ'

మాట్లాడుతున్న బాలోత్సవ కమిటీ సభ్యులు

అనంతపురం : ఈనెల 27, 28, 29 తేదీల్లో నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో పిల్లల పండుగ నిర్వహించనున్నట్లు బాలోత్సవ కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.నగరంలోని ఎన్‌జిఒ హోంలో బాలోత్సవం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకత, దేశభక్తి, మత సామరస్యాన్ని వెలికితీయడమే బాలోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ ఆర్గనైజింగ్ కార్యదర్శి సావిత్రి, కోశాధికారి మహమ్మద్ జిలాన్, విశ్వం విజ్ఞాన్ కేంద్రం రాజ్‌మోహన్, యుటిఎఫ్ అధ్యక్షులు గోవిందరాజులు, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అనంతపురం : నగరంలోని 1వ రోడ్డు శ్రీ పొట్టిశ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో 1999-2000లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాల్లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పట్లో విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులు ప్రకాష్, సుబ్బారాయుడు, జహంగీర్ బాషా, సుశీలమ్మ, గంగాధర ఆచారిని పూర్ణకుంభంతో ఆహ్వానించి పట్టు వస్త్రాలు ఇచ్చి ఘనంగా సన్మానించారు. అనంతరం అప్పట్లో చేసిన అల్లర్లు, సంతోషాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు డాక్టర్ షేక్షావలి, డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వరప్రసాద్, జెఎన్‌టియు ఆపోస్ ప్రెసిడెంట్ శిరీష్‌రెడ్డి, మాధవి మొబైల్స్ అనిల్‌కుమార్‌చౌదరి, కియా మోటార్స్ సుధాకర్‌రెడ్డి, టీచర్ కృష్ణారెడ్డి, తాడిపత్రి మున్సిపల్ అకౌంటెంట్ నాగార్జున, శ్రీధర్‌రెడ్డి, అమనుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఒకచోట చేరిన పూర్వపు విద్యార్థులు

జగన్ అవినీతి పాలనను అంతమొందించాలి

'యువగళం' విజయవంతం కావాలని పూజలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో సిఎం జగన్ అవినీతి పాలనను అంతమొందించాలని మాజీ కార్పొరేటర్ పరిమి రాజారావు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్న యువగళం పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను నగరంలోని మారుతీనగర్‌లో ఉన్న అరాఫత్ మసీదులో విడుదల చేశారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిగా అమరావతి అభివృద్ధి జరగాలన్నా, రాష్ట్రం పురోభివృద్ధి సాధించాలన్నా చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నేతలు సలీం, రఫీ, జిలాన్, నబీ రసూల్ , ముత్తు, జాకీర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో యువగళం పోస్టర్లు విడుదల చేస్తున్న టిడిపి నాయకులు

ఆత్మకూరు : ఈనెల 27న ప్రారంభమవుతున్న నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ మాజీమంత్రి పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు నియోజవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపల్లి సమీపంలో ఉన్న మమోబులేసు ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి అర్చన చేయించి 101 టెంకాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిటీ సభ్యురాలు లక్ష్మీదేవి, సత్యసాయి జిల్లా తెలుగు మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ, అధికార ప్రతినిధి పెద్ద లక్షిదేవి, రాప్తాడు తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి సుకన్య, ఆత్మకూరు తెలుగు మహిళ పద్మావతి, రాములమ్మ, అనిత, రామంజినమ్మ, ధనలక్ష్మి, చెన్నమ్మ, అదిలక్ష్మి, ఉష, రత్న, అక్కమ్మ, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో టెంకాయలు కొడుతున్న తెలుగు మహిళలు

నార్పల : టిడిపి యువనేత నారా లోకేష్ ఈనెల 27నుంచి చేపట్టనున్న యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామికి టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్‌రాజు ఆదివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, స్థానిక టిడిపి నాయకులు పూర్ణకుంభం, మేళతాళాలతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు పడుతున్న బాధలు, ఇబ్బందులను తెలుసుకునేందుకు నారా లోకేష్ పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 400 రోజులు, 4వేల కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. అనంతరం జంట ఆలయాల ఎదుట 400 టెంకాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఎర్రనాగప్ప, కుళ్లాయిస్వామి, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ రాజన్న, మాజీ జెడ్పిటిసి జాఫర్‌వలి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.